సాక్షి అనకాపల్లి

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

తిమిరాంలో సూర్యనారాయణస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. IIలో



జాబ్ మేళాకు స్పందన

నర్సీపట్నంలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 కంపెనీలు పాల్గొన్నాయి. 185 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. IIలో

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 31.5, కనిష్టంగా 23.4 డిగ్రీలు, తేమ శాతం 80 వరకు నమోదవుతుందని, గాలి గంటకు 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

21న మెగా జాబ్‌మేళా

చోడవరం రూరల్: ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ, మైక్రోసాఫ్ట్ కంపెనీల సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నవారు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చన్నారు. చోడవరం పరిసర మండలాల్లోని నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఇతర వివరాల కోసం ఉద్యోగ మేళా కోఆర్డినేటర్ హెచ్.సుధీర్‌ను 7780688683 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

పర్యాటక ప్రాంతంగా బొజ్జన్నకొండ అభివృద్ధి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: బొజ్జన్నకొండ వద్ద పర్యాటకుల వసతి కోసం కాటేజీలు, కొండ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చెప్పారు. విహారయాత్రకు వచ్చే పర్యాటకులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రస్థాయి 11వ బౌద్ధ మహా సమ్మేళనం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 25న విశాఖ అంబేడ్కర్ భవనంలో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు రాష్ట్ర 11 బౌద్ధ మహాసమ్మేళనం జరగనుందన్నారు. మయన్మార్ బౌద్ధ భిక్షువు డాక్టర్ ఆయుపాల మహాథేరో భంతేజీ, సారిపుత్ర భంతేజీలు హాజరవుతారన్నారు. పంచశీల సూత్రాలు, దమ్మ దీక్షపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ ప్రచార కార్యదర్శి బల్లా నాగభూషణం, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నెలపూడి బాలరాజు, లీగల్ అడ్వయిజర్ గిలకల అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల కమిటీలో కొంతమందిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రెటరీలుగా కె.రామన్నపాత్రుడు(విశాఖ), యన్నేటి రమణ(విశాఖ), సెక్రెటరీలుగా అక్కరమాని మంగరాజు(విశాఖ), భగత విజయకుమార్(విశాఖ), రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీగా ఎస్.ఆనంద్ బాబు(విశాఖ), రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రెటరీగా పటాన్ ఖాజావలి(విశాఖ), రాష్ట్ర సేవాదళ్ కమిటీ జాయింట్ సెక్రెటరీగా గవర నాయుడు(విశాఖ), రాష్ట్ర సాంస్కృతిక విభాగం కమిటీ సెక్రెటరీలుగా బొండాడ వెంకట రమణ(విశాఖ), సంపంగి శ్రీనివాసరావు(విశాఖ), జాయింట్ సెక్రెటరీగా కొండపు జగదీశ్వరరావు(విశాఖ), రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్. కాళిదాస్‌రెడ్డి(విశాఖ), రాష్ట్ర అధికార ప్రతినిధిగా పాకా సత్యనారాయణ(విశాఖ), సెక్రెటరీలుగా జి.రోసి రెడ్డి(విశాఖ), ఊడా శ్రీనివాసరావు(విశాఖ), యర్రా శ్రీనివాసరావు(అనకాపల్లి), జాయింట్ సెక్రెటరీగా గండేపల్లి త్రినాథ్‌మూర్తి(విశాఖ), గాలి రామిరెడ్డి(విశాఖ), పంపన సత్యబాబు (అనకాపల్లి), ఎస్టీ సెల్ కమిటీ సెక్రెటరీలుగా గోవర్ధన్ గిరి(అనకాపల్లి), అసిర గోవింద(అనకాపల్లి), కిముడు త్రిమూర్తులు దొర(అనకాపల్లి), జాయింట్ సెక్రెటరీగా కిముడు శివలక్ష్మి(అనకాపల్లి) నియమితులయ్యారు.

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి



సాక్షి, విశాఖపట్నం : ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సి.శ్రీనివాసమూర్తి శుక్రవారం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఈపీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా చేరిన శ్రీనివాసమూర్తి వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ సీజీఎం హోదాలో 2023లో పదవీ విరమణ చేశారు.

ఐటీ విభాగంలో విధులు నిర్వర్తించిన సమయంలో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, మైఈపీ, ఆన్లైన్ పేమెంట్, వాట్సాప్ ఆటోమేటెడ్ చాట్ తదితర ఐటీ ఆధారిత సేవలను రూపొందించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిత్యునికి ప్రణమిల్లి..

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి పర్వదినం
- రాజుపాలెం ఆలయంలో పోటెత్తిన భక్తులు
- ఇళ్లలో పాలు పొంగించి సూర్యనారాయణుడికి పూజలు



తప్పెటగుళ్ల ప్రదర్శన



రాజుపాలెం సూర్యనారాయణస్వామి



సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి



రాజుపాలెం ఆలయంలో బారులు తీరిన భక్తులు

అనకాపల్లి: ప్రత్యక్ష దైవానికి జగతి భక్తితో ప్రణమిల్లింది. సకల జీవరాసులకు ప్రాణశక్తినిచ్చి చల్లగా చూడమని లోకబాంధవుడిని ప్రార్థిస్తూ రథసప్తమి రోజున అఖిల భక్తకోటి పూజలు చేసింది. సూర్యదేవుడి ఆలయాల్లో ఆదిత్య హృదయం మార్మోగింది. జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం బ్రహ్మాద్రిపై వేంచేసి ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వెలుగుల రేడును దర్శించుకొని పులకించిపోయారు. రథసప్తమి కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచే తండోపతండాలుగా వచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా 22 అడుగుల మహాలక్ష్మీసమేత శ్రీవైకుంఠస్వామి విగ్రహాలను ఆవిష్కరించడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పులకించారు. భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రసాద వితరణ చేయగా ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నసమారాధన చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామ పరిసరప్రాంతాల్లో ఊరేగించారు. ఆలయం వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద నృత్యాలు, నేలవేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సుంకరమెట్ట ఆలయంలో..

సుంకరమెట్టలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ప్రసాద వితరణ చేశారు. ఇళ్లలో ఆవు పిడకలపై పాలు పొంగించి, సూర్యభగవానునికి ప్రసాదం నివేదించి పలువురు పూజలు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రాజుపాలెం, సుంకరమెట్ట దేవాలయాల్లోని సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాల కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుటుంబసమేతంగా రెండు దేవాలయాలను దర్శించుకున్నారు. ఇంకా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

మహిళలు స్వశక్తిపై ఎదిగేందుకు నైపుణ్య శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తనూజ రాకూర్

అనకాపల్లి: మహిళలు స్వశక్తిపై ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృత్తి నైపుణ్య శిక్షణతోపాటు బ్యాంకు రుణాలు అందిస్తున్నాయని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (ఎంవోఆర్డీ - ఎస్‌బీఐ) సహాయ కార్యదర్శి, ఫైనాన్షియల్ సలహాదారు తనూజఠాకూర్ కల్కో అన్నారు. స్థానిక ఎస్‌బీఐ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించి మాట్లాడారు. మహిళలు తీసుకున్న సమయంలో సంస్థలో ఏమైనా సమస్యలుంటే యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కష్టపడి స్వశక్తితో మహిళలు అభివృద్ధిలోకి రావాలన్నారు. స్త్రీశక్తిగా ఎదిగి అనేకమందికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 20 ఏళ్లగా లక్షలాది మంది గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అంతకుముందు టైలరింగ్‌లో శిక్షణ పొందిన స్త్రీ, పురుషులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ నటరాజ్, శిక్షణ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, ఏడీ సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

- వివిధ శాఖ అధికారులకు ఎన్నికలపై శిక్షణ
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి

తుమ్మపాల: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా రవిపట్టాన్ శెట్టి వివరించారు. అన్ని మౌలిక వసతులతో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేశామన్నారు. రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేశామని, అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మ కేంద్రాలను గుర్తించామని, వాటి దగ్గర అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గత ఎన్నికల్లో సంఘటనలను పరిగణనలోకి తీసుకుని, తదనుగుణంగా ప్రణాళికాయుక్తంగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మద్యం, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను ముందుగానే గుర్తించేందుకు అవసరమైన చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధంగా ఉందన్నారు. ఈవీఎంలపై ఓటింగ్ ఏవిధంగా చేయాలనే శిక్షణ కార్యక్రమాలు కూడా విస్తృతంగా కొనసాగుతున్నాయన్నారు. పోలీస్, రెవెన్యూ ఇతర సిబ్బందితో ప్రశాంత వాతావరణలో ఓటర్లందరూ నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా తగిన చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్, సీపీవో జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.పి. జయరాం, జిల్లాలో తహసీల్దారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.403 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్



తరగతి గదులను పరిశీలిస్తున్న నాగార్జున

చోడవరం రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి రూ.403 కోట్లు వెచ్చించినట్టు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ నాగార్జున యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన చోడవరం పట్టణ పరిధిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, మంచినీటి వసతి, మరుగు, మధ్యాహ్న భోజనం సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలు చదువుకునే పాఠశాలల అభివృద్ధి కోసం నాడు-నేడు రెండు ఫేజ్‌లలో రాష్ట్రవ్యాప్తంగా రూ.17 వేల కోట్లకు పైబడి ప్రభుత్వం వెచ్చించిందన్నారు. జరుగుతున్న పనుల తీరుతెన్నులు, విద్యార్థులకు అందించిన సౌకర్యాలను పరిశీలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో అనకాపల్లి మండలం తుమ్మపాల, మామిడిపాలెం పాఠశాలలు, చోడవరం మండలంతోపాటు బుచ్చెయ్యపేట, రావికమతం తదితర మండలాల్లోని పాఠశాలలను సందర్శించనున్నట్టు తెలిపారు. తమ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సైతం తమతో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఆయనతోపాటు నాడు-నేడు ఈఈ ఎ.రమేష్, ఏఈ రెడ్డి రామావతారం, మండల విద్యాశాఖాధికారి జయలక్ష్మి, ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు దేవరపల్లి సర్వశ్రీకుమారి, బిహెచ్.రామారావు, ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ఎ.వి.జగన్నాథరావు పాల్గొన్నారు.

శారదాపీఠంలో ఆధ్యాత్మిక వైభవం



రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు చేస్తున్న వేద పండితులు




యాగ శాలలో అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: జగన్మాత సన్నిధి ఆధ్యాత్మిక చింతనతో ఓలలాడింది. శారదాంబ ప్రాంగణంలో వేద ఘోషతో ప్రతిధ్వనించింది. సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల, వనదుర్గ హోమాలతో ఆధ్యాత్మికత గుభాళించింది. రెండోరోజు శుక్రవారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. రథసప్తమి సందర్భంగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పండితులు సూర్యనమస్కారాలతో ఆదిత్యుడిని కొలిచారు. పీఠం అనుష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు విశేష అలంకరణలో దాసాంజనేయస్వామి, మేధాదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు ఆచరించారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు.

జమ్మిచెట్టు ప్రదక్షిణ చేశారు. సాయంత్రం శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తిలకించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం సారధ్యంలో పీఠంలో శ్రీనివాస కల్యాణం వేడుకగా నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు.

నాగబాబు హంగామా!

- అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేస్తారంటూ హడావుడి
- తాజాగా యలమంచిలిలో నివాసం ప్రకటన
- ఇంటిని సమకూర్చనున్న 'సుందరపు' బ్రదర్స్
- నాగబాబుది ఐరన్ లెగ్ అంటూ జనసేన క్యాడర్ గుబులు
- ఆ సీటుపైనే చింతకాయల విజయ్, దిలీప్ చక్రవర్తి, కొణతాల కన్ను
- టీడీపీ, జనసేన శ్రేణుల్లో అలజడి



సాక్షి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీతో పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపుపై స్పష్టత లేకపోయినా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు ఉమ్మడి విశాఖ జిల్లాలో హంగామా చేస్తున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి తానే బరిలో ఉంటానంటూ అనుచరగణంతో లీకులు ఇప్పిస్తున్నారు. ఆ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఇప్పటికే ఇదే స్థానం నుంచి టీడీపీ తరఫున తన కుమారుడు విజయ్‌ను నిలపాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తలపోస్తుండగా, రియల్ ఎస్టేట్ వ్యాపారి దిలీప్ చక్రవర్తిని బరిలోకి దించాలని మరో వర్గం ప్రయత్నిస్తోంది. ఆయన ఈ టిక్కెట్టును ఆశిస్తూ వివిధ రూపాల్లో డబ్బు పంపిణీ కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇంతలో ఇటీవలే జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ కూడా ఈ స్థానాన్ని ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నాగబాబు వారం పది రోజులుగా అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తిరుగుతూ, కార్యకర్తలతో సమావేశమవుతూ హడావుడి చేస్తున్నారు. వారం తిరగకుండానే గురువారం మరోసారి వచ్చారు. ఈసారి ఆయన యలమంచిలిలోనే నివాసం ఉండబోతున్నానని కూడా ప్రకటించారు. దీంతో జనసేన నుంచి అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిని తానేనని చెప్పకనే చెప్పారు. గురువారం రాత్రి పార్టీ సమన్వయకర్తలతో రాంబిల్లి మండలం వెంకటాపురంలో సమావేశమయ్యారు. ఒకపక్క పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెబుతూనే పర్యటనలు కొనసాగిస్తున్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటే యలమంచిలిలో నివాసం ఉండాల్సిన అవసరం ఎందుకని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు అభ్యర్థిత్వం ఖరారైందనే భావన కలిగించేందుకే ఈ సంకేతాలిస్తున్నారని వీరంటున్నారు. అయ్యన్నకు చెక్ పెట్టడానికే నాగబాబుకు ఈ సీటు ఖాయం చేశారన్న ప్రచారం కూడా టీడీపీ వర్గాల్లో జరుగుతోంది.

ముందుకొచ్చిన సుందరపు బ్రదర్స్..

నాగబాబుతో సన్నిహితంగా ఉంటున్న యలమంచిలి ప్రాంతానికి చెందిన సుందరపు బ్రదర్స్ (విజయ్‌కుమార్, సతీష్‌కుమార్) నాగబాబుకు నివాసం సమకూరుస్తున్నారని జనసేన నాయకులు చెబుతున్నారు. యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఇటీవల నిర్మించిన భవనాన్ని నాగబాబు తాత్కాలిక నివాసానికి ఇస్తారని అంటున్నారు. అలా కానిపక్షంలో జనసేనలో మరో నాయకుడు పీవీజీ కుమార్ కూడా తన ఇంటిని ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్టు సమాచారం.

ఐరన్ లెగ్ అంటున్న శ్రేణులు..?

ఒకపక్క నాగబాబు అనకాపల్లిపై హంగామా చేస్తుంటే జనసేన పార్టీ శ్రేణులు మాత్రం ఆయనకు షాకిచ్చేలా చర్చించుకుంటున్నారు. నాగబాబుది ఐరన్ లెగ్ అని, అనకాపల్లి నుంచి పోటీ చేస్తే ఓటమి ఖాయమని, ఇక్కడ కాకుండా మరెక్కడ నుంచైనా పోటీ చేసుకోవడం మంచిదని గుసగుసలాడుకుంటున్నారు. దీనిని బట్టి నాగబాబు అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడం వీరిలో చాలామందికి ఇష్టం లేదన్న విషయం స్పష్టమవుతోంది. మొత్తమ్మీద నాగబాబు చేస్తున్న హడావుడి ఇటు టీడీపీ, అటు జనసేన శ్రేణుల్లో అలజడి రేపుతోంది.

మూడు గంటల పరీక్ష గంటన్నరలోనే..

- యలమంచిలి డిగ్రీ కళాశాల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షను గంటన్నరలోనే ముగించిన వైనం
- ఇదేమని వాపోయిన విద్యార్థులతో దురుసు ప్రవర్తన
- తప్పు తెలుసుకుని పరీక్ష మళ్లీ పెడతామన్న ప్రిన్సిపాల్
- పోలీసులకు, ఏయూ అధికారులకు విద్యార్థుల ఫిర్యాదు



తమకు జరిగిన అన్యాయాన్ని ప్రిన్సిపాల్‌కు వివరిస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు గంటలు నిర్వహించాల్సిన థియరీ పరీక్షను గంటన్నరలోనే ముగించి, కాలేజీ అధికారులు విద్యార్థులకు చుక్కలు చూపించారు. అదేంటి సార్ పరీక్ష సమయం 3 గంటలు కదా ? అని ప్రశ్నిస్తే అదేమీ కాదు.. గంటన్నరే అంటూ దురుసుగా మాట్లాడుతూ జవాబు పత్రాలను లాగేసుకున్నారు. దీంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు. వివరాలివి.. ఈ విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో ఆనర్స్ డిగ్రీ (సింగిల్ మేజర్ సబ్జెక్ట్) కోర్సును కొత్తగా ప్రవేశపెట్టారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలో మొదటి సెమిస్టర్ థియరీ పరీక్షలు ఈ నెల 7 నుంచి జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం బీఏ, బీఎస్సీ, బీకాం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించాల్సివుంది. బయాలజీ విద్యార్థులకు క్లాసికల్ బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ ఏఐ, డాటా సైన్స్ మేజర్ కోర్సులు చదివే వారికి అప్లికేషన్ ఆఫ్ మేథమెటికల్ ఫిజికల్ అండ్ కెమికల్‌సైన్స్ పరీక్షలు నిర్వహించారు. బీఏ, బీకాం కోర్సులు చదివే విద్యార్థులకు ఫండమెంటల్స్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఫండమెంటల్స్ కామర్స్ పరీక్షలు జరిగాయి. శుక్రవారం నాడు విద్యార్థులకిచ్చిన ప్రశ్నాపత్రంలో సమయం కూడా 3 గంటలుంది. కానీ యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9 గంటలకు పరీక్ష ప్రారంభించి 10.30 గంటలకే జవాబు పత్రాలను లాగేసుకు న్నారు. ఇదేమిటని విద్యార్థులు వెళ్లి పరీక్షా కేంద్రం నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యంగా సమా ధానం చెప్పారు. ఈ పరీక్ష కేంద్రంలో యలమంచిలి పట్టణం, అచ్యుతాపురంలో ఉన్న పలు ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వారంతా నిర్వాహకుల తీరును చూసి ఆందోళన చెందారు. ఇదే సమయంలో పట్టణంలో ఉన్న మరో రెండు ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాత్రం 3 గంటల సేపు పరీక్ష నిర్వహించారు.

ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు

ఈ విషయమై పలువురు విద్యార్థులు యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిటెండెంట్ పి.చంద్రశేఖర్‌కు రాతపూర్వక వినతిపత్రం అందజేశారు. ఇదే విషయాన్ని ఏయూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. వారితో పాటు పట్టణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పరీక్ష కేంద్రం నిర్వాహకులను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి రమణ, స్థానిక నేతలు నిలదీశారు. విద్యార్థులకు న్యాయం చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ వారికి హామీ ఇచ్చారు.

నేడు మళ్లీ పరీక్ష

వాస్తవానికి పరీక్ష పూర్తయిన వెంటనే విద్యార్థుల జవాబు పత్రాలను సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. ఏయూ అధికారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను డిపాజిట్ సెంటర్‌గా కేటాయించారు. అన్ని పరీక్ష కేంద్రాలకు చెందిన విద్యార్థుల జవాబు పత్రాలను భద్రపరిచి ఏయూకు పంపాల్సివుంటుంది. శుక్రవారం గంటన్నర సమయానికి విద్యార్థుల నుంచి జవాబు పత్రాలను లాగేసుకుని తప్పు తెలుసుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం నిర్వాహకులు నాలుక్కరచుకున్నారు. ఇదేమని విద్యార్థి సంఘ ప్రతినిధులు నిలదీస్తే, ఇదే పరీక్షను మళ్లీ శనివారం మధ్యాహ్నం మరో గంటన్నర వరకూ రాసేందుకు అనుమతిస్తామని చెప్పారు.

పొరపాటును సరిచేస్తాం

శుక్రవారం మా కళాశాలలో జరిగిన పరీక్ష ఎంసెట్ కాదు కదా. చిన్న పొరపాటు జరిగింది. విద్యార్థులకు న్యాయం చేయడానికి శనివారం ఉదయం పరీక్ష పూర్తయ్యాక మధ్యాహ్నం సమయంలో శుక్రవారం జరిగిన పరీక్ష జబాబుపత్రాలను విద్యార్థులకిచ్చి గంటన్నర సమయం ఇస్తాం. శుక్రవారం పరీక్ష నిర్వహించడంలో పొరపాటు జరిగింది. యూనివర్సిటీ నుంచి వచ్చిన ఫొటో ఎస్ఈఎఫ్-7 ఫారాలపై ఉదయం 9 నుంచి 10-30 గంటలని ముద్రించడంతో అదే నిజమనుకున్నాం. ఈ సమస్య తలెత్తినప్పుడు ఏయూ అధికారులకు పలుమార్లు ఫోన్ చేసినా వారి నుంచి ఎటువంటి స్పందన లేదు. మా వల్ల జరిగిన పొరపాటును సరిచేస్తాం.

-చంద్రశేఖర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, యలమంచిలి

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి జయరాజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కామేశ్వరరావు, తదితరులు

కె.కోటపాడు: అనకాపల్లిలో ఈ నెల 15న నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైయిర్ మనక్ పోటీల్లో మండలంలో ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.జయరాజ్ ప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 128 నమూనాలను ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఉంచారు. వీటిలో 14 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీటిలో ఎ.కోడూరు హైస్కూల్ విద్యార్థి జయరాజ్ ప్రదర్శించిన మల్టీపర్పస్ అగ్రికల్చరల్ సైకిల్ ప్రదర్శన ఉంది. చిత్తూరులో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైయిర్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహిస్తారని హెచ్‌ఎం కామేశ్వరరావు తెలిపారు. విద్యార్థితో పాటు సహాయక విద్యార్థి భరత్‌కుమార్‌లకు నిర్వాహకులు షీల్డ్‌తోపాటు సర్టిఫికెట్‌లను అందించారు. వీరిని శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం కామేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు ఎరుకునాయుడు, బి.శివప్రసాద్, మాధవి, స్వాతి అభినందించారు.

మెడికల్ హబ్‌గా ఏపీ

- వైద్య రంగానికి పెద్దపీట : ఎంపీ సత్యవతి
- వైఎస్సార్ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే గణేష్


వైఎస్సార్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారని ఎంపీ సత్యవతి పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రి అవరణలో నాడు–నేడు పథకం ద్వారా రూ.8.85 కోట్లతో నిర్మించిన అదనపు వైఎస్సార్ భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలలు ఉంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. సీఎం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి పేద ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో కోట్ల రూపాయలతో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. రూ.1.22 కోట్లతో జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని, రూ.1.25 కోట్లతో జగనన్న ఆక్సిజన్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మరో రూ.55 లక్షలతో ఆక్సిజన్ లైన్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు రూ.45 లక్షలతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్‌ను నిర్మించామన్నారు. రూ.35 లక్షలతో కోడ్–19 చిన్న పిల్లల యూనిట్‌ను, రూ.30 లక్షలతో హైరిస్క్ ప్రెగ్నెట్ మహిళలకు 8 పడకలతో హైడెన్సిటీ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రూ.10 లక్షలతో వంద పడకలకు ఆక్సిజన్ అందేలా సెంట్రల్ మెడికల్ గ్యాస్ పైపు లైన్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను బ్లడ్ బ్యాంక్‌గా మార్చడం జరిగిందన్నారు. సౌకర్యాలు కల్పించడంతో పాటు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రాంతీయ ఆస్పత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, గజ్జలపు మణికుమారి, టౌన్, మండల పార్టీ అధ్యక్షులు ఏకాశివ, లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాస్, సుర్ల సత్యనారాయణ, లగుడు శ్రీనువాసరావు, డీసీహెచ్ శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు షేక్ ఉస్నీషా బేగం, కర్రి శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి దేవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమమే సీఎం ధ్యేయం


తుని రైల్వేస్టేషన్‌లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు స్వాగతం పలికిన పార్టీ నాయకులు

ఎమ్మెల్యే బాబూరావుకు పార్టీ నేతల ఘన స్వాగతం

పాయకరావుపేట : వైఎస్సార్ కాంగ్రెసు పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి గుర్తింపు కల్పిస్తారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రాజ్యసభ సభ్యునిగా నామినేషన్ దాఖలు చేసి మొదటిసారి పాయకరావుపేటకు విచ్చేయడంతో తుని రైల్వే స్టేషన్‌లో గొల్ల బాబూరావుకు పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనను రాజ్యసభ (ఎంపీ)కు పంపించడం వల్ల దళిత సమాజంలో ఎంతో ఉత్సాహం వచ్చిందన్నారు. ఇది పాయకరావుపేట నియోజకవర్గానికి ఇచ్చిన మహత్తరమైన కానుక అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగుల్ని ఎమ్మెల్యేగా గెలిపించి, సీఎంకు కానుక ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు స్వాగతం పలికిన వారిలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, సింహాచలం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితురాలు జనపరెడ్డి శేషారత్నం, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరకాసుల గోవిందు, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్‌ల అధ్యక్షులు దేవవరపు రాజేష్‌ఖన్నా, కె.సుందరీలత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొంకిపూడి రామకృష్ణ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ ఉన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు


తిమిరాంలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

దేవరాపల్లి : మండలంలోని తిమిరాంలో సూర్యనారాయణ స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణతో కలిసి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలం నాయుడు, ఉప సర్పంచ్ యలమంచిలి బూసిబాబు తదితర గ్రామ పెద్దలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. హోరా హోరీగా జరిగిన ఈ పోటీల్లో ఎం.అలమండ ఎడ్ల జ్ఞాన చైత్ర ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో దేవరాపల్లి వీరాంజనేయ ఎడ్లు, తృతీయ స్థానంలో లక్ష్మీపురం మోహన్ శ్యామ్ కుమార్ ఎడ్లు నిలిచాయి. మొత్తంగా వరుసగా ఆరు స్థానాల్లో నిలిచిన వారికి జెడ్పీటీసీ కర్రి సత్యం, బూరె బాబురావు, కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ యలమంచిలి బూసిబాబు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. అనంతరం వీరంతా శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి


కానిస్టేబుల్ సమస్య వింటున్న క్రైం ఎస్పీ సత్యనారాయణరావు

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు దిగువ స్థాయి పోలీసు సిబ్బంది అర్జీలను స్వీకరిస్తూ, వారి వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.సత్యనారాయణరావు మాట్లాడుతూ ఎక్కువగా ఆరోగ్య సమస్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వివరించినట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

రేగుపాలెం హైవే వద్ద వ్యాన్, కారు ఢీ



రేగుపాలెం వద్ద ఢీకొన్న వ్యాను, కారు

నలుగురికి గాయాలు

యలమంచిలి : ఐషర్ వ్యాన్, కారు ఢీకొట్టుకున్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన బొడ్డేడ మనోహర్, బొడ్డేడ మూర్తి, మరో ఇద్దరు వ్యక్తులు కారులో అనకాపల్లి నుంచి కాకినాడ వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు, రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద గోడౌన్ నుంచి సామాగ్రిని అన్‌లోడ్ చేసి తిరిగి అనకాపల్లి వెళ్లడానికి యూటర్న్ తీసుకుంటున్న ఐషర్ వ్యాను ఢీకొన్నాయి. దీంతో కారులోని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహాయంతో 108లో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు

రాంబిల్లి : నారాయణపురం సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడింది. దిమిలి నుంచి నారాయణపురం వెళ్తున్న ఈ ఆటో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడినట్టు తెలిసింది. అయితే ఈ ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలైనట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆటో అద్దం, ముందు భాగం దెబ్బతింది. కాగా ఇక్కడి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.


నారాయణపురం సమీపంలో బోల్తా పడిన ఆటో

పంట దిగుబడులపై సలహాలు పాటించండి

అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సలహా పరిశోధన సంచాలకుడు జగన్నాథరావు


కొండెంపూడిలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట : రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధిస్తారని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సలహా పరిశోధన సంచాలకుడు. పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. అధిక పంట దిగుబడులు, రాయితీలు, వ్యవసాయ పనిముట్లపై రైతులకు అవగాహన కల్పించారు. మైదాన, గిరిజన ప్రాంత రైతులతో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే వారి వ్యవసాయ విధానాలు, పద్ధతులు తెలుస్తాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్ బి.ముకుందరావు, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ఉద్యానశాఖాధికారి ప్రభాకరరావు, ఆత్మ పీడీ ఆశ దేవి, శాస్త్రవేత్తలు కిషోర్, సత్తిబాబు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీ ప్రతినిధి

నర్సీపట్నం : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్ఎస్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాను జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాల ద్వారా కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో అనేక చోట్ల జాబ్ మేళాలు ఏర్పాటు చేసి వందలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించామన్నారు. జాబ్ మేళాకు ఏపీఎస్ఎస్‌డీసీ కంపెనీ ప్రతినిధులు, 14 కంపెనీలు పాల్గొన్నాయి. 425 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా అందులో 185 మంది అభ్యర్థులను వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మీసాల సుబ్బన్న, ప్రిన్సిపాల్ పంపన తాతబ్బాయి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌరీశ్వరస్వామికి ఘనంగా ఉత్సవరాట

మహాశివరాత్రి, కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు


స్వామివారి పెళ్లిరాట చేస్తున్న ఆలయ అర్చకులు, చైర్మన్, దేవదాయశాఖ అధికారులు

చోడవరం : ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో స్వామివారి మహాశివరాత్రి కల్యాణం ఉత్సవాల రాటను శుక్రవారం పండితులు వేతమంత్రాల మధ్య ఘనంగా వేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద ఈ ఉత్సవ రాటను వేశారు. మార్చి నెలలో శివరాత్రి ఉత్సవాలు, శ్రీ గౌరీపరమేశ్వరుల కల్యాణం మహోత్సవం కలిపి నిర్వహిస్తారు. ఈ రెండు ఉత్సవాలు ఒకే సమయంలో జరుగుతుండడంతో దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయం వద్ద ఉత్సవరాటను ఉదయం 9.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రాల మధ్య పెళ్లిరాట ఉత్సవంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఈ వేడుకను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, కమిటీ డైరక్టర్లు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి , సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వడ్డాది నర్సింహమూర్తి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా తయారు చేశారు.

విలువలతో కూడిన విద్య అందించడమే ధ్యేయం

- తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు
- నూతన శాఖ కార్యాలయం ప్రారంభోత్సవం


విద్యా సంస్థలను ప్రారంభిస్తున్న చైర్మన్ నున్న తిరుమలరావు

పాయకరావుపేట : రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల నూతన శాఖను, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌ను స్థానిక మెయిన్‌రోడ్డులో డీసీసీ బ్యాంకుపైన ఏర్పాటు చేశారు. దీన్ని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికి అందించాలనే సదుద్దేశంతో తిరుమల విద్యా సంస్థలను స్థాపించామని పేర్కొన్నారు. పాయకరావుపేట, తుని చుట్టుపక్కల గల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, మా శ్రేయోభిలాషుల కోరిక మేరకు పాయకరావుపేట, పీఎల్‌పురం సెంటర్ హైవే పక్కన తమ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్యాంపస్‌లో ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్‌గా ప్రారంభించామని, పాయకరావుపేట, తుని, అన్నవరం చుట్టుపక్కల గల అన్ని ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం 8008478777, 8520926777 నంబర్లలో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, తిరుమల సిబ్బంది పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో చోరీ

రూ.20 వేలు అపహరణ


దుకాణం షట్టర్ పెకలించిన దృశ్యం

చోడవరం రూరల్ : పట్టణంలోని చీడికాడ రోడ్డులో ఉన్న డిపార్ట్‌మెంటల్ స్టోర్ గౌతం బిగ్‌బజార్‌లో శుక్రవారం తెల్లవారుజాము సమయంలో దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. మండలంలోని ఖండిపల్లి గ్రామానికి చెందిన జి.గోవిందకు చెందిన దుకాణం షట్టర్‌ను బలంగా ముందుకు లాగి లోపలికి ప్రవేశించిన దుండగులు క్యాష్ కౌంటర్‌ను తెరిచి అందులోని సుమారు రూ.20వేల నగదును చోరీ చేశారు. సీసీ కెమెరా దృశ్యాల ప్రకారం ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. తెల్లవారు 3 గంటల నుంచి 4 గంటలలోపు చోరీ జరిగింది. మనుషులు, ఇతర వాహనాల రాకపోకల సమయంలో దుకాణం పక్కనే ఉన్న చిన్నపాటి సందులో దాక్కుంటూ చోరీకి పాల్పడ్డారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రల సాయంతో విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

అనకాపల్లి: సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని తెలిపారు.

వైఎస్సార్ చేయూతతో 5,650 మందికి లబ్ధి



గవరపేటలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు

కశింకోట: వైఎస్సార్ చేయూత పథకం నాల్గో విడత ఆర్థిక సాయాన్ని ఈ నెలలో విడుదల చేయనున్నారని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గవరపేట, హౌసింగ్ కాలనీల్లో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు అవగాహన కలిగించడానికి శుక్రవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత పథకం వల్ల మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 45 నుంచి 60 ఏళ్లలోపు వయసు గల సుమారు 5,650 మందికి లబ్ధి కలుగుతుందన్నారు. ఇప్పటికే మూడు విడతల ఆర్థిక సహాయం అందజేశారన్నారు. ఈ నెలలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆర్థిక సహాయం అందజేయనుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ సత్యనారాయణ, వీవోఏలు పద్మావతి, ప్రసన్న తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి 'ఇన్‌స్పైర్'కు విద్యార్థిని రక్షిత నమూనా ఎంపిక

కశింకోట: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనకు స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థిని టి.రక్షిత రూపొందించిన నమూనా ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రూపానంది తెలిపారు. అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో ఎంపిక చేసినట్టు తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 6,717 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,760
మొదటి రకం	3,630	4,240
రెండో రకం	3,460	3,700
మూడోరకం	3,260	3,480

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
నాగద్వీపం (తెలుగు):	సత్యనారాయణస్క్రీన్-1
మేడెన్ వెబ్(రెండు షోలు):	సత్యనారాయణ స్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన:	పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 117 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-38 యూనిట్లు, బి పాజిటివ్-43 యూనిట్లు, ఒ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్‌నంబర్ 9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

- కశింకోటలో 426 మందికి వైద్య పరీక్షలు



శిబిరానికి తల్లి సహాయంతో వస్తున్న దివ్యాంగుడు



గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యుడు తిరుపతిరావు



దివ్యాంగ బాలికకు వీల్ చైర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో 426 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 75 మందికి ఆప్తాలమిక్ సంధ్య కంటి పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కళ్లద్దాలు, ఒకరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి సిఫారసు చేశారు. మధుమేహ పరీక్షలు 370, రక్త శాతం పరీక్షలు 303, ఈసీజీ ఇద్దరికి నిర్వహించారు. గత శిబిరంలో పరీక్షించిన వారిలో 50 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కీళ్ల వైద్య నిపుణుడు గోపి, జనరల్ ఫిజీషియన్ జ్యోత్స్న, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమలరావు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. క్షయ వ్యాధి నిర్ధారణకు కఫం నమూనాలు సేకరించారు. గర్భిణులు, వికలాంగులు, వృద్ధులు, పిల్లలు శిబిరానికి హాజరై వైద్య సేవలు వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు స్థానిక పూసర్ల వీధికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసిన వీల్ చైర్‌లను, గత శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న వారిలో సిఫారసు చేసిన 50 మందికి ప్రభుత్వం అందజేసిన కళ్లద్దాలు, ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. జిల్లా ఆరోగ్య శాఖ ప్రాజెక్టు ఆఫీసర్, కార్యక్రమం ఇన్‌ఛార్జి జగదీష్, ఎంపీహెచ్ఈవో చుక్కల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది వైద్య, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంక్షత్రి జయరజని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

భుజాల నొప్పితో బాధపడుతున్నా...



చాలా కాలంగా శరీరం, భుజాల నొప్పులతో బాధపడుతున్నాను. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు పరీక్షించారు. మందులు ఇచ్చారు.తగ్గిపోతుందన్నారు. ఎంతో ఆనందంగా ఉంది.

–చెంగల అప్పలనరస, కశింకోట

మందులు ఉచితంగా ఇచ్చారు



మోకాళ్ల నొప్పులతో చాలా కాలంగా బాధపడుతున్నాను. నడవలేకపోతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

–చేబోలు లక్ష్మి, కశింకోట

కళ్లద్దాలు ఇస్తామన్నారు



కంటి సమస్య ఉండటంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షించారు. కళ్లద్దాలు కోసం సిఫారసు చేశారు.త్వరలో కళ్లద్దాలు ఉచితంగా అందిస్తామన్నారు. ఎంతో ఆనందంగా ఉంది.

–గొన్నాబత్తుల పార్వతి, కశింకోట.

నేడు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అనకాపల్లి: మండలంలో పలు అభివృద్ధి పనులకు శనివారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభిస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకుపాలెంలో రూ.80లక్షల సీఎస్ఆర్ నిధులతో(అరబిందో కంపెనీ) నిర్మించిన కల్యాణమండపం, బవులవాడ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, అక్కిరెడ్డిపాలెం గ్రామంలో నిర్మించిన సచివాలయం, సంపతిపురం గ్రామంలో ఆర్బీకే భవనాలను ప్రారంభించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ పాల్గొనున్నట్టు తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరువాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మునగపాక: పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ పాపారావు సందర్శించారు. అరబుపాలెం, ఒంపోలు, నాగులాపల్లి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులుకల్పించేందుకుచర్యలుతీసుకుంటు న్నామన్నారు.

కార్మికులు, రైతులకు అన్యాయం చేస్తున్న బీజేపీ



అనకాపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు



కశింకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

అనకాపల్లి: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్‌చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో భారత్‌బంద్‌లో భాగంగా పట్టణంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో పేదరికాన్ని పెంచి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెడుతోందని ఆరోపించారు. కార్మికులకు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ మోదీ విధానల వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఏఐటీయూ నాయకుడు ఆర్.దొరబాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు మోదీ ప్రభుత్వం సహజవనరులను కార్పొరేట్ సంస్థల పరం చేస్తోందని విమర్శించారు. అంతకుముందు సీపీఎం కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి ప్రదర్శన నిర్వహించి, నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నేతలు పి.ఎస్.వి. పరమేశ్వరరావు, వై.ఎస్.భద్రం, భాస్కరరావు, వి.శ్రీనివాసరావు, గంటా శ్రీరాం, పలకా సత్యనారాయణ పాల్గొన్నారు.

కశింకోటలో

కశింకోట: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా వివిధ సంఘాల కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంతబయలు నుంచి జాతీయ రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మికులకు రూ.26 వేల వేతనాన్ని నెలకు చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, పలు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కశింకోటలో శుక్రవారం రాత్రి పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న దంపతులు



సూర్యనమస్కారాలు చేస్తున్న సెంటర్ సభ్యులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తిలో గల సూర్యనారాయణమూర్తి ఆలయంలో రథ సప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెదురుపర్తితోపాటు కశింకోట, చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం

అనకాపల్లి: స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని శ్రీ సూర్యనారాయణస్వామి సమేత ఉషా, పద్మినిల కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. ఈ కల్యాణవేడుకలను తిలకించేందుకు ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గీతా మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యనమస్కారాలతో ఆరోగ్యం

అనకాపల్లి: నిత్యం సూర్యనమస్కారాలు చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని యోగా గురువులు కరణం బాబూరావు అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని స్థానిక యోగా లైఫ్‌సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాసనాలు, 108 పర్యాయాలు సూర్యనమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్ష దైవం సూర్యనారాయణస్వామిని స్మరిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతి ఏటా రథసప్తమిని నాడు సూర్యనమస్కారాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కరణం రమాదేవి, దేవిక, మహాలక్ష్మి, మణికంఠ, కృష్ణవేణి పాల్గొన్నారు.



వెదురుపర్తిలో సూర్యనారాయణమూర్తి

వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులను ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. తరువాత పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. దివ్యాంగునికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వీల్ చైర్‌ను అందజేశారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం ప్లాస్టిక్ బకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ప్రధాన కార్యదర్శి కరక శేషు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, పార్టీ నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

వాడపాలెంలో నవగ్రహ శాంతి హోమం



శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం : తంతడి శివారు వాడపాలెంలో శుక్రవారం నవగ్రహ శాంతి హోమం నిర్వహించారు. రథ సప్తమి వేడుకల్లో భాగంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, చోడపల్లి సత్యం, దేవుడు, కృష్ణ, పోలయ్య పాల్గొన్నారు.

వైభవంగా విజయదుర్గ విగ్రహం ఊరేగింపు

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెంలో విజయదుర్గ అమ్మవారి విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఊరేగించారు. ఈ నెల 19న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద హోమాలు నిర్వహించారు.

ఆదిత్యునికి పట్టువస్త్రాలు



రాజుపాలెం సూర్యనారాయణస్వామికి పట్టువస్త్రాలు అందిస్తున్న మురళీకృష్ణ



రాజుపాలెం ఆలయ ఆవరణలో అన్నసమారాధనలో భక్తులు

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెంలో రథసమప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ ఆలయంలో స్వామి నూకాంబిక ఆలయం తరపున చైర్మన్ కొణతాల మురళీకృష్ణ శుక్రవారం పట్టువస్త్రాలతోపాటు పసుపు, కుంకుమలు అందజేశారు. ఆయా ఆలయ చైర్మన్‌లు కొణతాల బాబూరావు, కేఎం.నాయుడులను నూకాంబిక ఆలయ పాలకవర్గాన్ని ఘనంగా సత్కరించారు.



రాజుపాలెం ఆలయ ఆవరణలో కోలాటం



సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్, భరత్‌కుమార్, దిలీప్‌కుమార్, రవి, సూరిబాబు, జానకీరామరాజు, రమేష్

ఘనంగా దేవతమ్మ పండగ



బూరెల బుట్టను ఊరేగిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న కేరళ డప్పు వాయిద్యం

మునగపాక : నాగులాపల్లిలో శుక్రవారం మళ్ల కుటుంబ సభ్యుల దేవతమ్మ పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి దేవతమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సేవ గరిడీలు, మేల తాళాలు, కేరళకు చెందిన డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

19న వెంకన్న ఆలయ శంకుస్థాపన

మునగపాక : మునగపాకలో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ నెల 19న ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం రాత్రి గ్రామపెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలని, గ్రామస్తులందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం 6వేల మందికి భోజన వసతి సదుపాయం కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మొల్లేటి సత్యనారాయణ, మళ్ల సంజీవరావు, వెలగా శ్రీనివాసరావు, బద్దెం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

డ్రిప్ పద్ధతిలో ఎరువుల వినియోగం మేలు



డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ అధికారులు

కోటవురట్ల: డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువుల వినియోగంతో ఖర్చు తగ్గుతుందని ఏపీఎంఐపీ పీడీ జి.వి.లక్ష్మి తెలిపారు. తంగేడు గ్రామంలో శుక్రవారం డ్రిప్ ఇరిగేషన్‌లో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ పద్ధతిలో ఎరువులు వృథా కాకుండా నేరుగా మొక్కకు అందుతుందన్నారు. తద్వారా ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా మొక్క ఎదుగుదల బాగుంటుందన్నారు. దీని వల్ల రైతుకు సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్ పరికరాలను రాయితీపై అందిస్తున్నారని, చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్, సిగ్నెట్ డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ సిబ్బంది, ఏపీఎంఐపీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.